క్లుప్తంగా

19వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



సత్తెనపల్లి: పట్టణంలోని 19వ వార్డు సుందరయ్య కాలనీ, వైఎస్ఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలియజేయగా అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది.శనివారం విద్యుత్ స్తంభాల్ని తీసుకురావడంతో పాటు ప్రత్యేక ట్రాక్టర్ ద్వారా వాటిని ఏర్పాటు చేశారు. సమస్య వెంటనే పరిష్కారానికి ఆదేశాలిచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు, స్పందించిన మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీకి, విద్యుత్ ఏఈ ఏఈ పి.కిరణ్‌కుమార్‌కు, కాంట్రాక్టర్ తాళ్లూరు మోహన్‌బాబుకు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీపై గడ్డి కత్తిరించే యంత్రాలు సిద్ధం



సత్తెనపల్లి: ప్రభుత్వం పశుపోషకులకు సబ్సిడీపై గడ్డి కత్తిరించే యంత్రాలు (చాప్‌కట్టర్) పంపిణీ చేస్తోందని పశుసంవర్ధకశాఖ సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ మంగు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వివిధ మండలాల్లోని పశుపోషకులకు సరఫరా చేసేందుకు సత్తెనపల్లి ఏరియా పశువైద్యశాలకు ప్రభుత్వం 21 చాప్‌కట్టర్ యంత్రాల్ని సరఫరా చేసినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2 హెచ్‌పీ, 3 బ్లేడ్ చాప్ కట్టర్ పూర్తి ధర రూ.33,970 కాగా 40 శాతం సబ్సిడీ అంటే రూ.13,588 పోను పశుపోషకులు చెల్లించాల్సింది రూ.20,382 మాత్రమేనని ఆయన వివరించారు. యంత్రాలు కావలసిన పశుపోషకులు సమీపంలోని పశువైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల పోటీల్లో బహుమతులు



క్రోసూరు: ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్ష ఏపీ, అమరావతి నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల్లో మండలంలోని దొడ్లేరుకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ఎంఈవో ఎం. గణేష్ శనివారం తెలిపారు. నరసరావుపేట శంకరభారతి పురం జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో ఇంటలెక్చువల్ డిసేబిలిటీ, సెరిబ్రల్ పాలసీ, బ్లైండ్, ఆటిజం, లోకో మోటార్ డిజేబిలిటీ, హియరింగ్ ఇంపైర్‌మెంట్ గల వివిధ విభాగాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని దొడ్లేరుకు చెందిన తిరుమలనాగేశ్వరరావు(ఇంటలెక్చువల్ డిసేబిలిటీ), ఉసర్తి మాధవి(హియరింగ్ ఇంపైర్‌మెంట్) రన్నింగ్, షాట్‌పుట్‌లలో ప్రతిభ కనబరిచి ప్రథమ,ద్వితీయ బహుమతులు పొందారని ఎంఈవో వెల్లడించారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం

మాచర్ల: పట్టణంలోని రింగురోడ్డు సెంటర్‌లో ఉన్న దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, చల్లా కాశయ్య, మోహన్, శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ వేముల కల్యాణి, కో–ఆప్షన్ మెంబర్ అనంతరావమ్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించి , టపాసులు పేల్చారు. చంద్రబాబుకు తగిన శాస్తి జరిగిందని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కొమెర రమేష్, దుర్గారావు, వేముల వెంకట్రావు, దుర్గారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి నెలరోజుల పాటు శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థానంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణమండపంలో 172వ ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు గురువు కూనిశెట్టి వెంకట జనార్దన్ శనివారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ఆహార నియమాలు బోధిస్తామన్నారు. సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని వివరించారు. వివరాలకు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ 9491665733, 9490846333 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ శివశంకర్

అమరావతి: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహణ సాధ్యమని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాల్ని వినియోగించుకుని కష్టపడి చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులంతా పరిశుభ్రత పాటిస్తూ పాఠ్యాంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో బోధన చేసి మంచి ఫలితాల్ని రాబట్టాలని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు అంశాల్ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులంతా అకడమిక్ టీచింగ్ విధానాల్ని తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. ప్రధానంగా ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఇంగ్లిష్ గ్రామర్ గురించి మరింత వివరంగా బోధించాలని తెలిపారు. గతంలో గురుకుల పాఠశాలల్లో చదివి మంచి ఉద్యోగాలు సాధించిన వారి వివరాల్ని సేకరించి, వాటిని విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థులంతా వారిని స్ఫూర్తిగా తీసుకుని చదివే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి వారం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా క్విజ్, క్రీడలు తదితర అంశాల్ని నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ముళ్ల పొదలు తొలగించడానికి, తరగతి గదుల సీలింగ్ పనుల్ని పూర్తి చేయడానికి అంచనాలు రూపొందించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ విజయశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సేవల్ని విస్తృతం చేయండి

పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రతి నెలా 30 ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, జనరల్ సర్జరీ సీహెచ్‌సీలోనే జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అందుతున్న సేవలు, సౌకర్యాల్ని అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాల వైద్యుల వద్దకు వెళ్లి అందిస్తున్న సేవల్ని తెలుసుకున్నారు. ముఖ్యంగా స్కానింగ్‌ల కోసం వచ్చిన గర్భిణులతో ప్రత్యేకించి మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో అందుతున్న సేవల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలల్లో ప్రసవించిన తల్లులు వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యశాలకు అవసరమైన సామగ్రిని అందిస్తామని తెలిపారు. వైద్యులు డ్యూటీ సమయంలో వైద్యశాలల్లోనే ఉండాలని ఆదేశించారు. అనంతరం రూ.8 కోట్లతో నిర్మిస్తున్న నూతన వైద్యశాలను ఆయన పరిశీలించారు. త్వరగా నిర్మిణం పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యశాల నిర్వహణ బాగుందని సిబ్బందిని అభినందించారు.

రాజీ మార్గమే రాజ మార్గం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి



పట్టణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌కు సత్తెనపల్లి పరిధిలోని నాలుగు న్యాయస్థానాల్లో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, పోలీసుల కృషి మరవలేనిదని తెలిపారు. కక్షిదారుల్లో కూడా బాగా అవగాహన పెరిగిందని చెప్పారు. మొత్తం మూడు బెంచ్‌లుగా నిర్వ హించారు. ఒకటో బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి, సభ్యులుగా న్యాయవాది నలబోతు వెంకటేశ్వర్లు వ్యవహించారు. రెండో బెంచ్‌కు సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.ప్రశాంతి, సభ్యులుగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, మూడో బెంచ్‌కు సత్తెనపల్లి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్, సభ్యులుగా న్యాయవాది బి.అమర్ నాయక్ వ్యవహరించారు. మొత్తం 709 కేసులు పరిష్కారం కాగా వాటిల్లో సివిల్–18, హెచ్ఎమ్ఓపీ–1, పీఎల్‌సీఎంసీ–10, క్రిమినల్–146, డీవీసీ–4, ఎంసీ–8, ఎన్ఐ యాక్ట్–3, 498ఏ–3, ఎస్టీసీ–516 ఉన్నాయి. వీటి ద్వారా రూ.1,16,51,653 నగదు చేతులు మారింది.

సమాజాభివృద్ధిలో గురువులే కీలకం



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎంఈవో శ్రీనివాసరావు, రోటరీ బాధ్యులు

సత్తెనపల్లి: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి అనంతవరం శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన తొమ్మిది మంది గురువులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పట్టణంలోని చరితారెడ్డి డిఫెన్స్ అకాడమీలో శనివారం అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్ని భావి భారత పౌరులుగా తయారు చేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్న రోటరీ క్లబ్‌కు అభినందనలు తెలిపారు. ఏకే హోమియో కేర్ డాక్టర్ లేళ్ల అయోధ్య కృష్ణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నవరత్నాలకు అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ బాపత్తు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ బాలికలకు సైకిల్స్, పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలతో పాటు ఉత్తమ ఉపాధ్యాయుల్ని సన్మానించుకోవడం తమ బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మిరియాల వెంకటేశ్వరరావు, ముత్తినేని శ్రీనివాసరావు, పెరుమాళ్ల పూర్ణచంద్రరావు, పెరికల సుధారాణి, కోనంకి కిరణ్ కుమార్, బోరుబోతు స్వర్ణలత, ఏల్చూరి ప్రసన్నకుమారి, పొనుగుపాటి సయ్యద్ మస్తాన్, పంచల నాగవేణును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, సెక్రటరీ సరికొండ రమాదేవి, ట్రెజరర్ పనమా నాగేశ్వరరావు, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ చందోలు వెంకట మల్లికార్జునరావు, పాయసం మహేష్ బాబు, రోటరీ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, మేరువ అంజిరెడ్డి, సాయి రమేష్, కోటగిరి గోపి, లక్ష్మన్, సుబ్బారావు, మాబూ సుబాని, మాతంగి రాహుల్ గౌతమ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎండుమిర్చి భారీ దండ



ప్రభుత్వ విప్ పిన్నెల్లి, వెంకటరామిరెడ్డిని ఎండుమిర్చి దండతో సన్మానిస్తున్న నేతలు

రెంటచింతల: ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను వైఎస్సార్ సీపీ నేతలు ఎండుమిర్చి భారీ దండతో ఘనంగా సన్మానించడం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కేను, యువజన నేత పీవీఆర్‌లకు ముందుగా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. పల్నాటి పౌరుషాన్ని ప్రతీకగా చరిత్రలో ఎవరూ ఎప్పుడూ తయారు చేయించని విధంగా రూ.62 వేల వ్యయంతో రెండు క్వింటాళ్ల ఎండుమిర్చితో తయారు చేయించిన భారీదండ ఈ కార్యక్రమంలో ఒక ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది.

బాబు అరెస్టు సక్రమమే

- ప్రజలు తెలుసుకోవాలన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయం ముందు సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: చంద్రబాబు అరెస్టులో రాజకీయ నేపథ్యం, ఎటువంటి కక్ష సాధింపు లేదనే విషయం ప్రజలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి కోరారు. శనివారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్‌కు చెందిన రూ.240 కోట్ల స్కాంలో సీబీసీఐడీ బాబును అరెస్టు చేయటంపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గుంటూరు రోడ్డు పార్టీ కార్యాలయం ఎదుట కొద్దిసేపు మద్దతు సమావేశం నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ పద్నాలుగేళ్ల సీఎంగా అనేక అక్రమాలు, స్కాంలు చేసి కోర్టుల నుంచి స్టేలు పొంది దొరగా తిరుగుతున్న చంద్రబాబునాయుడు ఈరోజు దొరికిన ఒక దొంగన్నారు. సుమారు రూ.240 కోట్లు తన అకౌంట్‌లో జమచేయించుకుని ఇప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడ న్నారు. సీఎంగా ఉండగా స్కాం జరిగిందని, నిధు ల విడుదలకు అప్పటి చీఫ్ సెక్రటరీ, ఆర్థికశాఖ లోని ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు వ్యతిరేకించారన్నారు. దీనిలో రూ.370 కోట్లు రిలీజ్ చేయగా అందులో రూ.40 కోట్లు జీఎస్టీ పోను, మిగతా వాటిలో రూ.90 కోట్లు ఖర్చుచేసి మిగతా రూ.240 కోట్లు స్కాంకు పాల్పడ్డారన్నారు. వీటిని షెల్ కంపెనీకి పంపించి వికాస్ అనే వ్యక్తి ద్వారా తన పీఏ అకౌంట్‌కు జమ చేయించి ఆ తర్వాత తన అకౌంట్‌కు జమ చేయించుకున్నాడన్నారు. దీనిపై ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు వాంగ్మూలం కూడా ఇచ్చారన్నారు. ఇదంతా సీబీసీఐడీ తన దర్యాప్తులో తేల్చిన వాస్తవాలు, నిజాలన్నారు. ప్రజలు దీనిని గమనించాలని ఆయన సూచించారు.

విస్తృతంగా బందోబస్తు



మాచర్ల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా అర్బన్ సీఐ టి.బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాలలో మోహరించి తనిఖీలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పడూ అండగా ఉంటాం



వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్లలో ఆగస్టు 29న జరిగిన ఘర్షణలో గాయపడి నర్సరావుపేట జీబీఆర్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న రాజబోయిన రవీంద్ర, పొన్నాల వెంకటేశ్వర్లు, సూదనబోయిన ఆంజనేయులును వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్న వారిని తెలుగుదేశం పార్టీ వారు తమ ఉనికి కాపాడుకునేందుకు రెచ్చగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు రెచ్చగొట్టే విధానాలు మానుకొని ప్రశాంతంగా జీవించాలని ఆయన సూచించారు. జెట్టిపాలెం సర్పంచ్ కాయకోకుల రామాంజనేయులు, కౌన్సిలర్ మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, పిన్నెల్లి రవితేజారెడ్డి, తోట శివ, లింగారెడ్డి, చింతా మురళి ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లను ఆదుకోవాలి

నాదెండ్ల: సమాజంలో అవహేళన, చిన్నచూపుకు గురౌతున్న ట్రాన్స్ జెండర్లను సమాజం ఆదుకోవాలని ఫ్రెండ్స్ న్యూ జెనరేషన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చెప్పారు. సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ట్రాన్స్ జెండర్లకు పండ్లు, భోజన ప్లేట్లను అందించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు శ్వేత మాట్లాడుతూ గతంలో సొసైటీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. లెప్రసీ, పేద, మధ్యతరగతి, అనాథలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి జీవనోపాధి కల్పించారన్నారు. రోడ్డు పక్కనే జీవనం చేస్తున్న అనాథలను ఆదుకున్నారన్నారు. అనంతరం వారికి ప్లేట్లు, ఫ్రూట్స్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంద్రు జ్ఞానయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షురాలు కె దుర్గ, చిలకలూరిపేట మద్దినగర్ ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ హనుమంతరావు, టీపీ వంశీ, విజయ ఉన్నారు.

గురజాలలో నాకాబందీ



నాకాబందీలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

గురజాల: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు శనివారం ఉదయం నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఎక్కడనుంచి ఎక్కడకు వెళ్తున్నారని సమాచారం అడిగి డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రయాణికులకు, వాహనదారులకు వివరించారు. ఎస్ఐలు టి.అశోక్‌బాబు, బి.అనంత కృష్ణ, ఏఎస్ఐ స్టాలిన్, హెడ్ కానిస్టేబుల్ కొండలు తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

- టీడీపీలో నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన 15 దళిత కుటుంబాలు
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన నేతలతో మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం

రాజుపాలెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటుందని, పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండలంలోని న్యూబోదనంలో గల ఆర్ అండ్ ఆర్ కాలనీలో టీడీపీ నుంచి 15 దళిత కుటుంబాలు శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అంబటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల్ని రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వానికి భిన్నంగా పరిపాలనను గడప వద్దకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని పేర్కొన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాగునీరు, విద్యుత్, బోర్‌లు, మురుగు నీటి కాలువల్ని అభివృద్ధి చేసేందుకు రూ.10లక్షలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన గుడిపాటి లోకయ్య, గుడిపాటి దానియేలు, గుడిపాటి దేవయ్య, గుడిపాటి సుబ్బారావు, పేరుపోగు లక్ష్మమ్మ, పేరుపోగు ఇసాకు, పేరుపోగు ఏసుపాదం, గుడిపాటి సుబ్బారావు, పేరుపోగు ఇస్రాయేలు, తోట అంజిలకు మంత్రి అంబటి , మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, లాయర్ పక్కాల సూరిబాబు, పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, సర్పంచ్ పాశం మహాలక్ష్మమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ తోట మోహన్‌రావు, సత్తెనపల్లి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, మాజీ సర్పంచులు సాతులూరి రామాంజనేయులు, వట్టే శివారెడ్డి, కడియం నరసింహారావు, మండల, గ్రామ సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్ పాల్గొన్నారు.

కేజీబీవీలో భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ: డీఈవో



పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్

గోళ్లపాడు(ముప్పాళ్ల): కేజీబీవీ పాఠశాలలో భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ ఆదేశించారు. మండలంలోని గోళ్లపాడులో కేజీబీవీ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఆహారం సరిగ్గా ఉండటం లేదని శుక్రవారం ఎంఈవోకు అందిన ఫిర్యాదు మేరకు విద్యార్థినులతో మాట్లాడి సమస్యల్ని తెలుసుకున్నారు. సోమవారం నుంచి మెనూ ప్రకారం ఆహారం అందివ్వడం లేదని గుర్తించారు. మజ్జిగ సరిగ్గా ఉండటం లేదని, కూరలు కూడా ఉడకకుండా వడ్డిస్తున్నారని, పలు సమస్యల్ని విద్యార్థినులు డీఈవో దృష్టికి తెచ్చారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ఇబ్బందులు తలెత్తితే చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రత్యేకాధికారిని మందలించారు. సరుకుల సరఫరాలో సమస్యలుంటే తమకు దృష్టికి తేవాలని చెప్పారు. విద్యార్థుల్ని ఇబ్బందులు పెట్టవద్దని ఉపాధ్యాయినులకు సూచించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటికి తూట్లు పొడిచేలా పని చేయకూడదని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఆహారాన్ని వడ్డించారు. ఆయనతో పాటు కస్తూరిబా పాఠశాలల అసిస్టెంట్ ఏసీడీ మాధురి, ఏడీ నాంచారయ్య ఉన్నారు.

దాడి చేసి అసత్య ఆరోపణలు తగదు

- వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం
- కంభంపాడులో పెరిగిపోయిన టీడీపీ అరాచకాలు
- దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ఆర్తిమళ్ల రాజా, నెట్టెం సురేష్

పెదకూరపాడు: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా బడుగు, బలహీన వర్గాల వారు వేడుకలు జరుపుకుంటుంటే మద్యం తాగి టీడీపీ కార్యకర్తలు అరాచకం సృష్టించారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్తిమళ్ల రాజా, నెట్టెం సురేష్, పాదిలి తిరపతయ్య, ఆర్తిమళ్ల సుబ్బయ్య తెలిపారు. మండలంలోని కంభంపాడులో శ్రీకృష్ణాష్టమి రోజున టీడీపీ నేతలు, వైఎస్సార్ సీపీ అధినేతల్ని దుర్భాషలాడటాన్ని ప్రశ్నిస్తే తమపై దాడి చేశారని వారు పేర్కొన్నారు. పైగా ఎల్లో మీడియాలో తామే దాడి చేసినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ కార్యకర్తల దాడిలో తగిలిన గాయాల్ని చూపించారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆర్తిమళ్ల గోపి, ఆర్తిమళ్ల బసవయ్య, మెదేపల్లి దుర్గా, సాదినేని శ్రీనివాసరావు, ఏటుకూరి సురేష్‌తో పాటు మరో పది మంది ఒక్కసారిగా కర్రలతో దాడి చేసి, గాయపర్చినట్లు తెలిపారు. వారిపై పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దాడికి పాల్పడి, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బీమా పథకాలు బాధితులకు వరం



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాధితులకు వరంలాంటివని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చీమలమర్రి, దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లోని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు ప్రమాద బీమా పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా పథకాలకు లబ్ధిదారుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం మనందరి బాధ్యతని తెలిపారు. ప్రధానంగా బీమా పథకాలు కుటుంబాలకు అండగా ఉంటాయని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటరావు, రమణారెడ్డి, సాంబయ్య, రామారావు పాల్గొన్నారు.

అమ్మవారికి కలువ పూలతో అలంకరణ

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రావణ మాసం సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కలువ పూలతో అభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కలువ పూలతో అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పర్యవేక్షించారు. ఆదివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా కోదండ రామస్వామికి విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి అనిల్‌కుమార్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జీవీ అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళన చేపట్టిన మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు పలువురు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈపూరు మండలం ముప్పాళ్లలో టీడీపీ భవిష్యత్‌కు భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి వెళ్లిన ఆయన అక్కడే బస చేశారు. ఉదయం ఆరు గంటలకు అక్కడకు వెళ్లిన పోలీసుల కళ్ళు కప్పి ఆంజనేయులు అక్కడి నుంచి మండల కేంద్రమైన ఈపూరులో ధర్నా చేపట్టారు. పోలీసులు అక్కడ జీవీని అదుపులోకి తీసుకుని బొల్లాపల్లి స్టేషనుకు తీసుకెళ్లారు.